రెండురూపాయిలు

శ్రీ టి.యల్. నరసింహమ్

రామ్మూర్తి నిద్రనించి లేచేటప్పటికి సాయంకాలం నాలుగు గంటలయింది. బద్ధకంగా వీధి గుమ్మంలోకి వచ్చాడు చూరు బల్లమీద నెయ్యి పెట్టి తపతపా కొడుతున్నాడు చేత్తో. నోరు అప్రయత్నంగా ఏదో పాట పాడేస్తోంది.

ఇంతలో గోపాలం సైకలుమీద వెళ్లిపోతూ "హ్యాట్ సార్" అన్నాడు. రామ్మూర్తి నవ్వి "ఏముంది...అన్నట్టు ఆగవోయ్!" అన్నాడు.

గోపాలం అలా సైకలు మళ్లించుకొని వచ్చి ఆగాడు ఒక కాలు మెట్లమీద వుంచి అన్నాడు. "ఏమిటి?"

"నిలబడు" అని లోపలికి వెళ్ళాడు రామ్మూర్తి. తిరిగివస్తున్నప్పుడు నట్టింటి దగ్గరే ఆగి.

"అమ్మ! నా బీరువామీది పెట్టిమీద రెండు రూపాయలుంచేను ఎవరైనా తీసేరా?" అన్నాడు.

తల్లి బియ్యం బాగు చేస్తూన్నదల్లా తల పైకెత్తి "ఆఁ–?" అన్నది దీర్ఘంగా. రామ్మూర్తి ప్రశ్న తిరిగివేశాడు.

"నాకు తెలీదు నాయనా!" అన్నది ఆవిడ.

"అయితే, మరి ఏమయినట్టు?"–ఎవరో తీసేవుండాలి; లేకపోతే వాటికి కాళ్లొచ్చి నడిచిపోయాయా?" అని రామ్మూర్తి వీధిలో కొచ్చాడు.

"ఏమిటి, బ్రదర్?" అన్నాడు గోపాలం.

"ఏమీలేదు. నీకు రెండురూపాయలివ్వాలిగా పొద్దున్న రమణమూర్తి నాకివ్వవలసిన రెండురూపాయలూ ఇచ్చేశాడు. అది నీకిచ్చేద్దామని నిలబెట్టమన్నాను,—కాని మా వాళ్లున్నారే, దేవాంతకులయ్యా—నిద్రపోయి లేచేసరికే ఎవరో కొట్టేశారు" అన్నాడు రామ్మూర్తి.

"అన్నన్నా! అయితే వేగం వెళ్లి కనుక్కో, లేకపోతే కాలదోషంగాని పట్టెయ్యగలదు."

"—రేపు ఇచ్చేస్తాన్లే"

"ఫరవాలేదులే" అని గోపాలం సైకిలు తొక్కుకు వెళ్లిపోయాడు.

"అయితే రెండురూపాయలు యేమైనట్టు?" అన్నాడు రామ్మూర్తి తల్లితో.

"అదేమో, నాయనా! వాసుగాని తీసేడో ఏమిటో ఆకతాయివెధవ!" అన్నది తల్లి.

ఆఁ–వాడే తీసుంటాడు. అసలు వాడేడీ?"

"ఏమో–నువ్వు పడుకున్నావు, వాడూ, సోమన్నా చిన్నన్నా అందరూ కొంతసేపు ఇటూ అటూ తిరిగి వెళ్లిపోయారు"

"నా గదిలో కొచ్చాడా?"

"ఏమో, ఒచ్చే వుంటాడు. అటూయిటూ తెగ తిరిగేడు"

"వాడిదెబ్బే యిది. గదిలో కొచ్చేడంటే కనబడతాయి. తీసుక పట్టుకుపోతాడు."

"అవును. ఎదురుగుండా ఎందుకు పెట్టేవ్?"

"ఎదురుగుండా అంటే వీడిలా తీసేస్తాడని నేనేం కలగన్నానా ఏమిటి? జాగ్రత్తగా బీరువామీద పెట్టేనుమరి."

"ఎంత బావుందిరా, వాడిలాటివాడని ఎన్నడూ ఎరగనట్టు చెబుతున్నావు!"

"ఉండు, వాడు రానీ చెప్తాను, చితక్కొట్టేస్తాను వెధవని, మరెప్పుడూ యిలాంటి పనులు చెయ్యకుండాను."

"వాణ్ణి కొడితే యిచ్చేస్తాడేంటి? యీపాటికి కప్పుడే అయ్యేపోయుంటాయి. వెధవ, రెండు రూపాయలు అంటే యెంత?"

"మేట్నీ కొట్టేసుంటాడు, వెధవ!"

ఇంతలో వీధి గుమ్మంలో ముకుందరావు ఆగమనాన్ని సూచిస్తూ "హోయి!" అని ఓ కేక వినపడ్డది. రామ్మూర్తి ఉగ్రంగా అటు వెళ్లి చూశాడు.

వాసు నేలమీంచి ఎకాయెకీ రెండో మెట్టుమీదికి దుమికి చేతులోవున్న మూడు పేటల నులకతాడుని స్తంభానికి చుట్టి "హంటర్ వాలీకి బేటీ!" అన్నాడు.

"వెధవా ఎక్కడరా చచ్చేవు ఇంతసేపాయిన్నీ?" అని ఉగ్రుడై ప్రశ్నించాడు రామ్మూర్తి. వాసు మెట్లన్నీ యెక్కివొస్తుండగానే వాడి చేతులో కొరడా లాక్కున్నాడు.

"ఆఁ యేమిటి - రా, ఆదివారంనాడు కూడా నీ యధికారమేనా మోసు," అన్నాడు వాసు

"వెధవా! ఆదివారం అయితే అధికారం వదులుకోవాలిరా?" అని కొట్టబోయేడు రామ్మూర్తి

"ఆఁ - అమ్మో - నా హంట రిచ్చీరా!" అని ఏడుపుమొహం పెట్టాడు వాసు

వాడి చెవి పట్టుకుని లోపలి వాకిట్లోకి ఈడ్చుకొస్తూ "రా! నీకివాళ వుంది ఎడ పెడ లగ్గం" అన్నాడు తల్లి వట్టంట్లోంచి "ఒరే వాణ్ణి కొట్టకుమీ" అన్నది

"నిజం చెప్పు, నా బీరువామీది రెండు రూపాయలు ఎవరు తీసేరు? ఎందుకు తీసేవు?"

"నే న్తియ్యలేదురా!" అన్నాడు వాసు చెవిబాధతో

"ఊఁ - తియ్యలేదూ? వెధవా? ఓ వెధవపనికితోడు అబద్ధం కూడానా?" అని చెవి ఇంకా మెలిపెట్టాడు రామ్మూర్తి

వాసు ఏడుపు లంకించుకున్నాడు దాంతో రామ్మూర్తి వాణ్ణి వొదిలాడు

"జెల్లకొడితేనా వెధవని" అన్నాడు

"ఎందుకురా వాణ్ణలా కొడతావ్?" అంటూ తల్లి రంగంలో ప్రవేశించింది

"మళ్లీ జన్మలో యిలాటి పన్లు చెయ్యకుండాను!"

"నే తీస్తే నీ తోదురా?" అని ఏడుపులోంచి వాసు అన్నాడు

"వెధవా! నే న్చస్తే నీకెంత సులభంగా వుందిరా?" అని "జెల్ల" కొట్టేడు రామ్మూర్తి వాడు స్వరం పంచమం లోంచి షడ్జమానికి పోనిచ్చాడు

"వాడు తియ్యలేదురా! ఎందుకలా చెయిజేసుకుంటావూ?" అన్నది తల్లి

"తీస్తే మాత్రం వాడు చెప్తాట్టమ్మా? రూన్ని ఒక్లేనా వేసుగుంటాడుగాని కొప్పుడు అవు నింతలో ఏమిటి చేసేవురా రెండ్రూపాయలున్నా?" అని రామ్మూర్తి వాసు జేబులో చెయ్యిపెట్ట బోయాడు

వాసు ముక్కు చీదుకుంటూ "ఉంరు, కావలిస్తే నే న్తీసిస్తాను," అని గబగబా జేబులోంచి తియ్యసాగాడు ధనరూపంలో అణాకానీ వుంది ఒక పగడమూ, నాలుగు గురిగింజలూ, కొత్తల నారమట్లు రెండు, ఓ చిన్న బొంగరమూ, సులకతాడూ పంట్లాం జేబులో వున్నాయి చొక్కాజేబులో నలిగిపోయిన సంపెంగ పువ్వొకటి ఉంది

"వెధవ - అప్పుడే ఖర్చుపెట్టేసేరు! అణాకానీ యేత్రా మిగిలింది?" అన్నాడు రామ్మూర్తి

"వాడు తియ్యలేదురా!" అన్నది తల్లి

చటుక్కున రామ్మూర్తికి ఓ ఆలోచన కలిగింది అమ్మ తీసిందేమో!-అవును నాన్న యింట్లో లేనప్పుడు చిల్లరఖర్చు ఏదేనా పెట్టవలసివస్తే ఎదురుగుండా కనబడుతూన్న డబ్బులు తీసుకోకేం జేస్తుంది? మళ్ళీ యిచ్చేద్దామనుకొని తీసుకొనేవుంటుంది

"ఆఁ - ఎవరు తీసేరో నాకు తెలిసింది" అన్నాడు రామ్మూర్తి నవ్వు తెచ్చుకొని; నిజంగా తెలిసినవాడిలాగే

"ఎవరు తీసేరు?" అన్నది తల్లి

"- నువ్వే!"

"ఛీ -"

ఇంతలో వాసు అరవసాగాడు, 'ఆఁ ఆఁ అమ్మే తీసి నామీద పెట్టేసింది"

"- ఇందాట నువ్వా గదిలో కెళ్ళ లేదూ?"

"ఇదే బావుంది వెళ్లు, వళ్లు, నే నా రూపాయ లేమిటో ఎరగను విమలగాని తీసిందో ఏమిటో - ఇందాట అదీ మీ నాన్నగారూ ఏదో రూపాయలనీ అదనీ మాట్లాడేరు"

"ఉట్టిదే, నువ్వు తియ్యలేదంటూ మేమో అని విమలమీద పెట్టేస్తున్నావ్!-నా రూపాయల్నాకిచ్చీ—" అన్నాడు రామ్మూర్తి చిన్న పిల్లడిలాగ

వాసు గబగబా వెళ్లి పక్కింట్లోవున్న విమలని ఏదో కొంపమునిగిపోయినంత ప్రమాదం కబురు చెప్పి తీసుకొచ్చేశాడు

"ఏమిటన్నయ్యా!" అని విమల చాలా గాభరాగా అంది

"అన్నయ్యవి రెండ్రూపాయలు పోయేయట బీరువామీద పెట్టిమీదపెట్టేట్ట; నువుగాని తీసేవా?"

"ఓ యబ్బ - ఇంతేనా! ఏమిటో అయి పోయిందనుకున్నాను, బాబూ"

"అబ్బ - దూద్దూ దుక్కలాగ రెండ్రూపాయలూ పోతే ఒస్ ఇంతేనా అంటోంది! అన్నాడు రామ్మూర్తి

"బావుంది ఎక్కడ పెట్టేవో వెతుక్కుంటే సరి!"

ఇదే తీసుంటుందన్నయ్యా - అందుకే అంత నిబ్బరంగా మాట్లాడుతున్నాది" అన్నాడు వాసు

"వెధవా! నే తీసేన్రా? అని విమల వెనక్కి తిరిగి వాసుని తపతపా రెండు అంటించింది

"అస్తమానూ వాణ్ణలా కొడతా రెందుక్రా?"

"- ఊఁ - కొట్టక ముద్దిస్తారు వీణ్ని. తీరుగూ మని దొంగతనం అంటగడుతున్నాడు ఇవాళ రెండ్రూపాయలు అయింది రేపు మరోటవుతుంది అప్పుడు నేను చచ్చిపోవాలి," అన్నది విమల ఏడుపు మొహంతో

"బావుందర్రా! ఇద్దరూ ఏడుస్తూ కూచోండి," అంది తల్లి

"అయితే నా రూపాయలు యాషై నట్టు?"

"ఫ్యూ ఏదుష్!" అన్నాడు వాసు నవ్వి

"ఊఁ - యేడుస్తారు ఏడవకేం జేస్తారు? వెధవ వీడే తీసేడు అందుకే వీడి కంత చటకారంగా వుంది వెధవా ఏం చేసేవురా అంత డబ్బున్నా?" అని ఒకటి తగల్నిచ్చాడు వాసుకి రామ్మూర్తి

"బావుందర్రా సాగుసు ఇంక వాణ్ని వొదల్రు గావోసు," అంది తల్లి

వాసు ఏడుస్తున్నాడు "నే న్తియ్యలేదురా కావలిస్తే సరస్వత్తోడు వేస్తానురా!" అన్నాడు

"ఒరే, నువ్వు నీ గదిలో ఓమాటు సుబ్బరంగా వెతుకు, ముందర! ఆదికి ముందే వాణ్ణి కొట్టడం ప్రారంభించావు!" అన్నది తల్లి

ఎంతో అనకాలం లేదు అయినా తల్లి ఒకవేళ తీసి మళ్ళీ అక్కడ పెట్టేసిందేమో అని అనుమానం కలిగింది రామ్మూర్తికి గబగబా వెళ్లిచూశాడు ఆ రూపాయ లెక్కడా లేవు ఒకవేళ జేబులోగాని వుంచేసి ఇలా భ్రమపడ్డం జరిగిందేమో అని అక్కడా చూశాడు ఇంకా ఎక్కడెక్కడ పెట్టడానికి వీలుంటుందో అక్కడంతా చూశాడు ఆనక వీల్లేనిచోట్ల కూడా చూశాడు ఆ గదిలో ఎక్కడా లేదు పోనీ యిటువేపు గదిలో ఎక్కడయినా వుంటుందేమో అని వెతికితే యెక్కడా లేవు—"

"ఈగదిలో ఎవళ్లు పడేస్తార్రా?" అన్నది తల్లి

"నీకు తెలీదమ్మ, యీ యింట్లో మనుషులసంగతి వాళ్లు స్వతహాగా మంచి

నారసింహలేహ్యము

బంగారు చేర్చబడెనది మేహము, నిర్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ సబ్బి రు 3-4-0 పోస్టేజి 10 అ

పి సి ఏ &కంపెని "ఆయుర్వేదసమాజం"

పెరి - నెల్లూరు జిల్లా

వాస్తే పాపం, కాని వాళ్ళ చేతులు మాత్రం మంచివిగావు, నోళ్ళంతకన్నా మంచివిగావు ముఖ్యంగా యీ వెధవ-" అని పక్కనే వున్న వాసు చెవిపట్టుకున్నాడు రామ్మూర్తి

"బావుందిరా వాలకం, మాటమాటకీ వాణ్ణి కొడుతుండడం! - వాడు తియ్యలేదు మొర్రో అంటూంటే ఎందుకలా వాణ్ణి హింసపెడతావు? ఇదే బావుందిరోయి నువ్వెక్కడో పారేసుకుని వాణ్ణి తంతున్నావ్ ఆ గదిలోకెవరొచ్చారో ఏమిటో నువ్వు నిద్దరపోతున్నప్పుడు" అన్నది తల్లి

విమల చటుక్కున "అన్నయ్యా! ఒకవేళ నాన్న తీసేరేమో రా?" అన్నది

అలా అని చిన్ననవ్వు నవ్వి నోట్లో చిటికెనవేలు పెట్టుకుంది విమల అది రామ్మూర్తికి అవమానం అనిపించింది "ఆఖరుకంత లోకువయ్యా నన్నమాట ఏడిపించండి, ఏడిపించండి డబ్బుపోయి అవమానం వొచ్చి అన్ని వేడుకలూ అయినాయి పోనెండి ఎంతకీ స్వయంకృతాపరాధం! అనుభవించక తప్పదు," అన్నాడతను

"అదికాదన్నయ్యా! ఇందాట నువ్వు నిద్రపోతున్నప్పుడు నాన్న ఇటొచ్చి ఆ బీరువామీద డబ్బెవర్లదే అని అడిగేర్రా! అంతే నీది కావొచ్చని చెప్పా నన్నయ్యా అప్పటికాయన వీధిలోకి వెళుతున్నారు ఏదో అవుసరమొచ్చింది కామోసు, సంగుని పెట్టె తియ్యడానికి బద్ధకమై, పోనీ ఎదురుగుండా వుందిగదా అని తీసుకొనుంటారు," అన్నది విమల నెమ్మదిగా

ఇది నిజమే అనిపించింది రామ్మూర్తికి ఇంకో అరగంటకి మళ్లా అందరూ సావిట్లో చేరారు

"మధ్యాహ్నం నా బీరువామీద రెండు రూపాయలు మీరేనా తీసేరు, నాన్నా?" అన్నాడు రామ్మూర్తి నవ్వుతూ

"అయిందీ, ఆ రెండురూపాయలూ పోయాయా అప్పుడే?" అన్నాడాయన తెల్లబోయి

"ఆఁ ఆఁ గమ్మత్తులు"

"నీమొహం ఇందాట నే నడిగేను విమల్ని ఆ బీరువామీద డబ్బెవర్దనీ అంతే అన్నయ్యదికాబోసు అందది అనీసి అదలా వదిలిపోయింది నే నిలా వొచ్చాను ఇంతట్లో మీ మామకి కార్డు రాదామని జ్ఞాపకమొచ్చింది కార్డు తీసి కొంతసేపు రాశాను రాస్తూవుంటే నీకోసం మేడపల్లివారి చిట్టిబాబొచ్చాడు రామ్మూర్తున్నాడా, అంటే పరధ్యానంగా, వున్నాడు గావోలు చూసుకో అన్నాను వాడికి మతి గదిలో ప్రవేశం వుందిగా! వెళ్లేడు అంటేసుంటాడు - మీ అమ్మనడిగి తీసుకో మరేం చేస్తాం? అలాంటి వాడితో స్నేహంచేస్తే అంతేనని నే నెంత చెప్పినా విన్నావ్?" చూసేడు చూసేడు ఇవాళ అవకాశం దొరికింది కొట్టేసేడు తగినశాస్తి చేసేడులే"

"ఆఁ- అనుకున్నంత పని అయింది చిట్టిబాబే వస్తే యినప్పెట్టెలూ, సందుగు పెట్టెలే ఆగవు అలా యిష్టమొచ్చినట్టు పడేస్తే వుంటుందా? అందులో పోనీ మరోటీ మరోటేనా? డబ్బారోను ఎలాటివాణ్ణైనా యిట్టే మార్చేస్తుంది అందులో చిట్టిబాబునా? కొలుకింది కేడీ వాడు!" అన్నది తల్లి

"పోనీ వో ఘడియుంగు మామ్మగాని తీసిందేమో కనుక్కుందాం ఎక్కడికెళ్ళిందే మా అమ్మ?"

"ఆ కళ్లారింటి కెళ్తానన్నారు బుల్లెమ్మన్నగారుగా నుంటే రాత్తిరి ఎనిమిదైపోతుంది," అన్నది తల్లి

"ఊఁ - హుఁ! మామ్మ తియ్యదు చిట్టిబాబే," అన్నాడు రామ్మూర్తి నిశ్చయంగా విరక్తిగా అక్కణ్ణించి వెళ్లిపోయాడు వెనకాతలే విమలా, వాసూ వెళ్లారు, సానుభూతి చూపిస్తూ

"ఛీ, ఇంతటివాడనకోలేదు ఏదో నా సావాసం అబ్బేక బాగుపడ్డాడనుకున్నాను చివరికి నామీదనే వేశాడు కన్ను," అన్నాడు రామ్మూర్తి పరుపుమీద చతికిలపడుతూ

"కనకపు సింహాసనమున, శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునం దొనరగ పట్టముగట్టిన," అన్నాడు వాసు

"ఆహా! ఖచ్చితంగా అలాగే చేసేడు ఒక్క పిసరేనా భేదంలేదు" అన్నది విమల

"ఎన్ననుకుంటే ఏం లాభం? అతన్నింట్లోకి రానియ్యడమే తప్పు"

"ఇందాట నే నలా వెళుతున్నాను చిట్టిబాబు అల్లా మెల్లకన్ను రామిగాడికి రూపా యిస్తున్నాడు ఇవాళ మనకి దొరికిందొకళ్ళు! అన్నాడు నేన్చూశాను," అన్నాడు వాసు

"అలాంటప్పలో వొంద ఉంటాయి అందుకే మొన్న వాళ్లింట్లో పండిగ్గానూ, బంగారంబిళ్లా తీసేడు" అన్నాది విమల—

"ఛీ-ఇంక అతన్ని యింట్లోకి రానియ్యకూడదు" అన్నాడు రామ్మూర్తి

ఇంతట్లో వీధిలో కేక వినపడ్డది అది చిట్టిబాబు గొంతుకని వెంటనే గుర్తుపట్టారు ముగ్గురూ

"చెప్తానుండు యేదో తేల్చుకుంటాను ఏ పెన్నో కొట్టేసి నా డబ్బు నేను గిట్టించుకుంటాను," అన్నాడు రామ్మూర్తి లేచి, దొంగతనం చెయ్యగలిగినవాడి లాగే వీధిలో కెళ్ళాడు చిట్టి నవ్వుతుంటే అతని కెలాగో ఉంది "ఏమిటోయ్?" అన్నాడు నిస్పృహతో

"పదం డలా వెళ్ళొద్దాం!" అన్నాడు చిట్టిబాబు

నడుస్తూ "ఇందాట మీ యింటికొచ్చాను, మీరు నిద్దరపోతున్నారు పోనీ నిద్దరపోతున్నారు ఎందుకు కదల్చడం అని వూరకున్నాను ఇంతట్లో మీరే అటూ ఇటూ కదిలేరు రామ్మూర్తిగారూ అని పిల్చేను పలికేరు మీరు కాని కళ్లు విప్పలేదు పడుకుంటారు గావోల్సని వెళిపొచ్చేను" అన్నాడు చిట్టిబాబు

"ఆ ఎదురుగా వున్న రెండ్రూపా

(43 వ పేజీ చూడండి)



రెండురూపాయిలు

(14-వ పేజీ తరువాయి)

యలూ జేబులో వేసుకొని!'' అనుకున్నాడు రామ్మూర్తి

"అవునుగాని యివాళ సినిమా కెళ్లాం వొస్తారండీ? అందాజ్ ట చాలా బాగుందిటండీ'' అన్నాడు చిట్టిబాబు

రామ్మూర్తి భరించలేకపోయాడు తన డబ్బుపెట్టి ఎన్ని విలాసాలూ! ఎంత ధీమాగా ఖర్చుపెట్టడానికి సిద్ధమయ్యాడు - దుర్మార్గుడు!

చివరికెలాగో ఆలోచించుకుని రామ్మూర్తి అన్నాడు

"చిట్టిబాబూ! నీతో ఓ ముఖ్యమైన సంగతి చెప్పాలోయి నువు నిన్నివాళ ఎంతగా బాధపెట్టావో నేను చెప్పలేను

చిట్టిబాబు తెల్లబోయి 'అదేమిటండీ అలా అన్నారు?'

"అనవలిసొచ్చింది నేను నిజం దాచవలసినవాణ్ణి కాను మొహమాటపడవలసిన వాణ్ణీ కాను అంచేత అలా చెప్పాను నువు ఇకముందైనా మంచి ప్రవర్తనలో పడతావని నా నమ్మకం'

'ఏమిటండీ యిలా మాట్లాడుతున్నారు? కొంపతీసి హాస్యం కాదుగదా!'

'అబ్బే హాస్యంకాదు నిజమే'

"నేనేమిటి చేసేనండీ యిలా మాట్లాడుతున్నారు?

'- నువ్వివాళ ఒక ఘోరమైన పని చేశావోయి దాంతో నాకు మనస్సు విరిగిపోయింది ఇంక అది అతుక్కోదు

'ఇవాళా? నేనా? - ఏమిటండీ అంత ఘోరమైన పని?'

'ఏమిటో నీకు తెలుసు నాకు తెలుసును మరి చెప్పుకోడం దేనికి?

'నాకు తెలియదండీ చెప్పకూడదూ?

"ఏమీ లేదు, నువ్వివాళ ఓ ఘోరమైన పని చేశావు దాంతో నా మనస్సు విరిగిపోయింది నిన్ను మరి చేరనియ్యకూడదని నాకు తేలింది ఇక ముందయినా నువు నీ ప్రవర్తన్ని సరిచేసుకుంటే బాగుపడతావు లేకపోతే ఇప్పటికే నీకో చెడ్డపేరుందా? మరీ చెడ్డవాడివై పోతావు'

'ఇప్పటికి మనకి చెడ్డపేరు లేదులెండి - ఒక సంవత్సరం కిందట చిట్టిబాబంటే చెడ్డ గుణాలన్నిటికీ పేరు మోసి వుండేవాడు ఇప్పుడా చెడ్డవి మనకి లేవు —అడగండి కావలిస్తే ఎవర్నయినా చిట్టిబాబు మాటి వాడూ అని!—మునుపు చెడు తిరుగుళ్లు తిరిగేవాడు గాని ఇప్పుడు బాగుపడ్డాడంటారు"

'కాని ఆ బాగుపడ్డమంతా ఎవరి చలవ?

"నే నొప్పుకుంటానే అంతా మీ దయే మొట్టమొదట మీరు కోవెల చలవ రాయిమీద కూచోబెట్టి నే చేస్తున్న పన్లు మంచివి కావని చెప్పిన సంగతి మరిచిపోను అనక మీదగ్గిరకొస్తుండడము నా చెడు బుద్ధులు మానియ్యడమూ అంతా అయింది నిజంగా నా కిప్పుడు పరీక్షల్లో బాగా మార్కులొస్తున్నాయంటే మీ దగ్గిర నేర్చుకోవడమే కారణం కాని చెబుదురూ ఇవాళ నే చేసిన ఘోరమైన పని ఏమిటో అని'

"ఎందుకు లెదూ!''

"మీరలా ఎందుకనేస్తే నే నొప్పుకోను ఇన్నాళ్లబట్టి నేను చెడ్డ పనన్నది చెయ్యలేదు ఇవాళ మీరిలా అంటున్నారంటే నాకు చాలా దీనిగా వుంది ఏమిటి నే చేసిన తప్పు పనీ అని! నిజంగా చేసింది తప్పే అయితే మరెప్పుడూ చెయ్యను ఏమిటి చేసేనో చెప్పండి!

"ఊహించుకో నీకే తెలుస్తుంది'

'నాకేం తెలియడం లేదు

"కాదు తెలుస్తుంది నువ్వివాళ మాయింటికొచ్చి ఏమిటి చేసేవో అంతా జ్ఞాపకం తెచ్చుకో'

'—ఇవాళా? మీ యింటికొచ్చేను మీ నాన్నగారు సావిట్లో వున్నారు రామ్మూర్తిగారున్నారా అని అడిగాను లోపలికి వెళ్లి చూడమన్నారు నేను మీ గదిలో కొచ్చి చూసేను మీరు నిద్రపోతున్నారు నేను దేనికని వెళ్లిపోతూ వుంటే మీ రోమాటు అయినా ఇయాకద లేరు లేచేవున్నారుగాబోలని ఓమాటు పిల్చేను మీరు, పలికేరుగారి కళ్లు విప్పలేదు పడుకుంటారు గాబోలు పోనీ మళ్లీ వొద్దామని వెళిపొచ్చేను

'ఇంతేనా? ఇంతకంటె ఇంకేం చెయ్యలేదూ?

"ఇంతేనండీ"

'నిజంగా గాయత్రి సాక్షిగా?

"కాదండీ - నా మనస్సాక్షిగా కూడా చెపుతున్నాను

అయితే నీతో ఇంక ఒక్కమాట కూడా మాట్లాడను పెద్దమనిషివయ్యావనుకున్నాను కాని ఇలాటివాడివని అనుకోలేదు' అని గిరుక్కున తిరిగి ఇంటివేపు వచ్చేస్తున్నాడు రామ్మూర్తి

"రామ్మూర్తిగారూ!" అని చిట్టిబాబు పరుగెత్తివచ్చి కలుసుకున్నాడు

'నాతో మరి నువు మాట్లాడకోయ్!'

చిట్టిబాబు నిల్చుండిపోయాడు, రామ్మూర్తి ఇంటికొచ్చేశాడు అట్నుంచి మామ్మ మెల్లిగొస్తున్నాది ఇట్నుంచి ఇతను మెల్లిగొచ్చాడు ఇద్దరూ ఆ చివర్న కలుసుకున్నారు

రామ్మూర్తికి ఆశ వదల్లేదు

"మామ్మా! నా బీర్వామీది పెట్టిమీద రెండ్రూపాయలు పెట్టేను మీరుగాని తీసేరా?

మామ్మ నవ్వి "భడవా రెండెక్కడ్రా?" అన్నది

'ఊం - హుం! రెండ్రూపాయలూ నే పెడితే!

'అదేమో నేను మజ్జాన్నం మాడిటికి గావోసు అటొచ్చాను ఆ కిటికీలోంచి రివ్వుని గాలి కొట్టింది ఓ రూపాయినోటు ఎగిరొచ్చి ఇలా పడ్డది నువ్వు బీర్వామీద పెట్టుకున్నావని అంతకిముందే మీ నాయినా వియలా అనుకున్నారు అంపోం పిడిది కావోసని తీసి దాచేను" అన్నది మామ్మ

"అయితే రెండో రూపాయి యేమైనట్టు?" అన్నాడు రామ్మూర్తి బహుశా వాసు దాంతో సోమన్నకి చిన్నన్నకీ టీపార్టీ జరిపి ఉంటాడని శేషం అనా కానీ అనీ ఓ మాటు అనుకున్నాడు

మళ్ళీ బహుశా ఆ రూపాయి చిట్టిబాబు తీసి మ్లేకన్ను రామిగాడికిచ్చేశాడేమో

వివాహం

బాపట్ల వాస్తవ్యులైన కీ॥ శే॥ డాక్టర్ వేదాంతం బావనారాయణగారి రెండవ కుమారుడు

చి॥ నరసింహదాసుకును

మచిలీపట్నంలో కెమిస్టు, డ్రగిస్టు అయిన శ్రీ వి వి శాస్త్రిగారి కుమార్తె

చి॥ సౌ॥ పద్మావతికిని

22 6 51 తేదీన కన్యాదాత గృహమున వివాహము జరిగెను బంధుమిత్రులు, పుర ప్రముఖులు అనేకులు వచ్చి వధూవరుల నాశీర్వదించిరి కానుకలు చదివించిరి

అనుకున్నాడు అయితే, అతనికి సినిమాకెళ్లానికి డబ్బు ఎక్కడిదీ? వాళ్లమ్మని పీడించి వుంటాడు ఆవిడ యిచ్చి వుంటుంది

"అదేమో గాని నీ రూపాయిగుగో" అని మామ్మ తిన్నగా యింట్లోకెళ్లి భగవద్గీతలోంచి తీసిచ్చింది

రామ్మూర్తి అనుమానంగా నోటుని నలిపాడు ఆశ్చర్యం! ఆ నోటు రెండు పొరలయింది!

అప్పుడతనికి జ్ఞాపకానికొచ్చింది అవి రెండూ కొత్త - సరికొత్త - బ్యాంకు నోట్లని తన కాడబ్బిచ్చిన రమణమూర్తి లేడూ, వాళ్ల నాన్న ఇంపీరియల్ బేంకులో పనిచేస్తూన్నాడు! మొన్ననే ముప్ఫయొకటో తారీకు!

"రెండు రూపాయ లేనండీ!" అన్నాడు రామ్మూర్తి

"ఏవిరా?" అన్నది మామ్మ ఆశ్చర్యంగా

ఈలోగా ఇంట్లోవాళ్లందరూ అక్కడ జేరారు అందరికీ జరిగిన కథ విపులంగా ఎంత వీలైతే అంత విపులంగానూ చెప్పాడు అక్కడున్న ప్రతీవ్యక్తికి తనకథ — అనగా తనకీ ఆ రెండురూపాయలకీ ఉన్న సంబంధం — చెప్పడం కూడా జరిగింది ఆ కథ లన్నీ వినతగినవి

చిట్టిబాబు వీధిలోంచి కేక వేశాడు రామ్మూర్తి సంతోషంతో వెళ్ళాడు

ఎంతో మనస్తాపం వెళ్లగక్కుతూ చిట్టిబాబు అన్నాడు

"మీరు రెన్నంటే అనండి — నాతో మాట్లాడ్డం కూడా మానియ్యండి కావలిస్తే కానీ నేచేసిన తప్పేమిటో నాకు చెప్పండి ఇవాళ నేనేం చెయ్యలేదుగదా నిష్కారణంగా ఇతన్లాటివాడితో ఫ్రెండ్షిప్పెందుకు పోవాలని నాకు చాలా బాధగా వుంది తన్నయినాసరే, కసిరయినాసరే నాకు తప్పేమిటో చెప్తేగాని వెళ్లను!"

"నీ తస్సాచెక్కా ఆ మాటలన్నీ జ్ఞాపకముంచుకున్నావుటోయి?" అన్నాడు రామ్మూర్తి, నిజంగా ఆ మాటల్ని తను మనస్ఫూర్తిగా అననట్టు

"జ్ఞాపకమేమిటండీ - చాలా బాధగా వున్నది"

"హాఁకా! మరిచిపోవయ్యా! ఉత్తినే అన్నాను"

"ఉత్తినే ఎందుకంటారండీ, నాలో తప్పు లేందీ?"

"ఉత్తినే అన్నానయ్యా! నమ్ము అంతే"

"నచ్చు, నేన్నమ్మను అంతంత లేసిమాట లుత్తినే యెందుకంటారు? - అయితే నేనోకలా అనుకున్నానండి, నిద్రపోతున్నప్పుడు లేపేను, ఆ తరవాత మరి మీకు నిద్రపట్టలేదు గావోసు అందుకో కోపగించుకొనుంటారూ అనుకున్నాను ఏం అంతేనా?"

రామ్మూర్తి ఛటుక్కున "అబ్బ నీ తస్సాచెక్కా! యెంత బాగా కనిపెట్టేవోయ్!" అన్నాడు

"లేకపోతే ఉట్టినే అలా అనేస్తారా అనుకున్నాను"

"సరేగాని నీ సినిమాప్రోగ్రాం ఏమి టైంది?"

"ఏమి టవడం మీరొస్తే సెకండ్షోకి పోదాం"

రామ్మూర్తి ఏలాటివాడూ అన్నది మన కక్కర్లేదు కాని అతను సినీమాకి చిట్టిబాబు కర్చుమీద వెళ్లాడు వెళ్లడమే కాకుండా ఆనాటి చరిత్ర అలా జరిగినట్టు ఎన్నడూ చిట్టిబాబుకు చెప్పలేదు ఇంట్లో ఎవర్నీ చెప్పవద్దన్నాడు ★

(3-వ పేజీ తరువాయి)

సంగతి మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి - అలా అంగీకరించక గత్యంతరం మాత్రం యేముంది? అంగీకరించకపోతే ప్రత్యామ్నాయం, ముస్లిం లీగుకు ప్రత్యేక రాజ్యాంగ నిర్మాణ సభ యేర్పడాలనే ప్రతిపాదన అక్కడ సిద్ధంగానే కనుపించుతోంది అంటే యేమన్న మాట? - అవునా గోదానమే ఇవ్వకున్నా గోదానమే అన్నట్టు పాకిస్థాన్ యేర్పడటం యెట్లాగూ తప్పదనే సంగతి స్పష్టంగా కనుపించుతోంది అందుచేత, గత్యంతరంలేక, కాంగ్రెస్ కార్యవర్గం, బిటిష్ ప్రధాని 6 వ డిశంబరు ప్రకటనను కాబినెట్ మిషన్ వారి వ్యాఖ్యాన పురస్సరంగా అంగీకరించవలసి వచ్చింది

గాంధిజీ అసహాయత.

ఆవిధంగా, అత్యంత త్వరితగతిని గాంధిజీ తెరమరుగుకు వెళ్లిపోతున్నారు మంత్రులే స్వయంగా యోజించటమూ స్వయం బాధ్యత మీద వ్యవహరించటమూ జరుగుతోంది

1947 ఫిబ్రవరిలో స్వరాజ్యమిస్తామనే వాగ్దానం జరిగింది జూన్‌లో వ్యవహారం పరిష్కారమైంది అదేవిధంగా, జూన్ నెలతో గాంధిజీకూడా సంపూర్ణంగా పతనమై పోయారు ఎలాగంటే, ఆయన బీహారునుంచి ఢిల్లీకి తిరిగివచ్చిన మొదటి మూడురోజుల్లోనూ (జూన్ 4,5,6 తేదీలు) "దేశవిభజనను నాప్రాణం ఫణంగాబెట్టి ప్రతిఘటించుతా" నని ఉద్ఘాటించారు 7,8, తేదీలలో కాశ్మీర్ వ్యవహారాలను గురించి ప్రస్తావించారు 9 వ తేదీన దేశవిభజన ప్రసక్తి లేకుండా మౌనంగా ఊరుకున్నారు తీరా 10 వ తేదీన, దేశవిభజన ప్రతిపాదనను అంగీకరించమని ప్రజలకు సలహా యిస్తూదానితో పాటు నాయకులనందరినీ రద్దు చేసివేసుకోమని హెచ్చరించారు ఇక 11 వ తేదీన, కాంగ్రెస్ కమిటీ సమావేశంలో — యెన్నడూ లేని ఆచారం — దేశవిభజన సూత్రాన్ని అంగీకరించుతూ నాయకులకు మద్దతు నివ్వమని, వోటింగుకుముందే తాను ప్రసంగానికి దిగారు

ఈ విషయాల నన్నిటినీ యిప్పుడు యెందుకు త్రవ్వి యెత్తవలసి వచ్చిందంటే తాను అధ్యక్షుడుగా వున్న ఆ సంవత్సరం పొడుగునా, తన ప్రమేయమే లేకుండా యిలాంటి వ్యవహారాలన్నీ ఆయన నెత్తిమీదగా జరిగిపోతుంటే, కృపలానీ యెంతగా బాధపడి వుండవచ్చునో ఊహించటానికి వీలౌతుంది తరవాత, తన మనోవ్యధనంతా కృపలానీ, గాంధిజీతో అనేక పర్యాయములు వెళ్లబోసుకున్నారు గోలు వెళ్ళి మద్దెలతో మొరబెట్టుకున్నట్టు — తనతో పాటు వ్యధితుడౌతున్న ఆయనతో మొరబెట్టుకుని మాత్రం ప్రయోజనమేమిట? ఆ అసహాయ స్థితిలో, గాంధిజీ, తాను చేయగలిగిందేమీ లేక, అధ్యక్ష పదవికి రాజీనామా దాఖలు చెయ్యవలసిందిగా కృపలానీకి సలహా యిచ్చారు లేదా — రాజీనామా పెట్టాలనుకుంటున్న కృపలానీ అభిప్రాయాన్ని తానూ ఆమోదించారు రాజీనామా దాఖలైంది ఆమోదించబడ్డది కాని దానివల్ల కలిగిన ఫలితమేమీ లేదు కాంగ్రెస్ అధ్యక్షుడికి, ప్రత్యేకశాఖను దేన్నీ నిర్వహించే బాధ్యత యేదీలేకుండా, మంత్రివర్గంలో సభ్యుడుగా వుండేటట్టు చేయాలని కూడా ఒకప్పుడు అనుకున్నారు కాని ఆ అభిప్రాయం నాటికీ నేటికీ కూడా అలానే గాలిలో వుండిపోయింది

ఈ రాజీనామా ద్వారా చాలా తీవ్రమైన ఫలితాలను తీసుకు రాగలనని కృప